తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
13-07-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 155
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575


# స్థలాభావం కొరతకు
# సరికొత్త పరిష్కారం!

## ఇక ఫ్లైఓవర్ల కిందే కాంపాక్ట్ విద్యుత్ సబ్‌స్టేషన్లు..!

కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుపై టీజీఎస్పీడీసీఎల్ నిర్ణయం

తొలి దశలో మూడు చోట్ల కాంపాక్ట్ సబ్‌స్టేషన్లు

భూసేకరణ సమస్య కు ప్రత్యామ్నాయం కొత్త విధానం




హైదరాబాద్ లాంటి మహానగరాల్లో రవాణాకోసం వినియోగిస్తున్న ఫ్లైఓవర్ల కింద ఖాళీగా ఉన్న ప్రదేశాలలో సబ్ స్టేషన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది.అత్యాధునిక కాంపాక్ట్ సబ్‌స్టేషన్లను నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అధికారులతో ఇప్పటికే చర్చలు పూర్తిచేశారు .క్యూర్ పరిధిలోని 10 సర్కిల్ లలో 450 సబ్ స్టేషన్ లు ఉండగా హైదరాబాద్ నగరంలో కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం 10 ప్రాంతాలను గుర్తించారు.మొదటి విడతలో మూడు చోట్ల సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం.

2

## నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..



- కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తుచేసిన బీఆర్ఎస్ నేత
- రైతుల కోసం రక్తమైనా ఇస్తామన్న కేటీఆర్
- ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు

2

## “నీకు మా రక్తం కావాలా”..



- "సీఎం వ్యాఖ్యలు సైకోలా, శాడిస్ట్‌లా ఉన్నాయి"
- "నీళ్లు పారించమంటే రక్తం పారిస్తారా?"
- "రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధం"
- "షాబాద్ ఘోరంపై సీఎం నోరు మెదపలేదు"
- "వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పండి"

2



## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి ఫైర్

- రైతుల కోసం రక్తమిస్తామన్న జగదీశ్
- నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీత
- రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలని డిమాండ్

3



## షాబాద్ హంతకుడి హైడ్రామా!

- పెట్రోల్ అయిపోవడంతో కారును వదిలేసిన రాజ్‌కుమార్
- రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం విఫలం
- 3 ఫోన్లు, 12 సిమ్ కార్డులతో తప్పించుకునే ప్లాన్
- శ్రీశైలం, బెంగళూరు మార్గాల్లో పోలీసుల గాలింపు

3

భువనగిరి–చిట్యాల నాలుగు లేన్ల
## రోడ్డుకు శంకుస్థాపన

- రూ.339.59 కోట్లతో పనుల ప్రారంభం
- 109.3 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన
- భువనగిరి-చిట్యాల ఫోర్ లేన్ రోడ్డుకు మోక్షం
- తగ్గనున్న ప్రయాణ సమయం, పెరగనున్న భద్రత
- వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపు

2



## హరీష్ రావుకు రక్తం చిందించే ధైర్యం లేదు..

- నాడు పెట్రోల్ పోసుకున్నారు కానీ అగ్గిపెట్టె తెచ్చుకోలేదు: జగ్గారెడ్డి ఎద్దేవా
- కేసీఆర్, హరీష్‌కు క్షమాపణ డిమాండ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటు కౌంటర్
- ఈటెల రాజేందర్‌పైనా విమర్శలు
- తుంగతుర్తి వివాదంపై స్పందన



## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- ఎలీఈడీ డిజిటల్ వాహనాలతో వినూత్న అవగాహన ప్రచారం
- రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థలపై పోలీసుల ప్రత్యేక నిఘా
- పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం అలర్ట్‌గా ఉండాలి
- డ్రగ్స్ సమాచారం కోసం 1908 టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ ఏర్పాటు

3

EAGLE FORCE
TELANGANA
ELITE ACTION GROUP
FOR DRUG LAW ENFORCEMENT

## రాష్ట్ర పరిపాలనను అమ్ముకుంటున్న కాంగ్రెస్

- సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ అరవింద్ ఫైర్
- కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- కవిత ఆరోపణలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్

2





## కాళేశ్వరంపై కేసీఆర్ బయటకు వచ్చి మాట్లాడాలి: అద్దంకి దయాకర్ సవాల్

- ఇంట్లో కూర్చోవడానికేనా కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత పదవి ఇచ్చింది?
- లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతుంటే చూస్తూ ఊరుకోలేం.
- ఎన్డీఎస్ఏ (NDSA) నివేదికను పక్కనబెట్టి హరీశ్ రావు డ్రామాలు ఆడుతున్నారు.
- దమ్ముంటే అసెంబ్లీకి రావాలి, లేదంటే కాళేశ్వరం దొంగలుగా మిగిలిపోతారు.

3

## 'తెలంగాణ రక్షణ సేన' గుర్తింపుపై వెనక్కి తగ్గేదే లేదు

- ఈసీ అనుమతితోనే 105 నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం పూర్తి చేశాం.
- అభ్యంతరాలు ఎవరో చెప్పకుండా సమాధానం ఎలా ఇస్తాం? వ్యక్తిగత విచారణకు ముందే కాపీలు ఇవ్వాలని డిమాండ్.

హైదరాబాద్, సిరి న్యూస్

తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపునివ్వాలని ఆ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈనెల 7వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కవిత రిప్లయ్ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో

మిగతా 2వ పేజీలో..



# 'తెలంగాణ రక్షణ సేన' గుర్తింపుపై వెనక్కి తగ్గేదే లేదు

మొదటిపేజీ తరువాయి

అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో ఎన్నికల కమిషనర్‌లకు లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తమకు తెలంగాణ రక్షణ సేన పార్టీ తమకు కేటాయించడంతో తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణ పరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జూన్ 23న తమకు లేఖ రాస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని పేర్కొన్నారని వివరించారు. కానీ ఇంత వరకు ఆ అభ్యంతరాల్లో ఒక్కటి కూడా తమకు పంపలేదని తెలిపారు. అభ్యంతరాలు ఎవరు తెలిపారు?, ఆయా అభ్యంతరాల్లో ఏమి పేర్కొన్నారు?, అనే వివరాలు కూడా ఇవ్వలేదన్నారు. అసలు అభ్యంరాతలనే తమకు పంపకుంటే తాము సమాధానం ఎలా చెప్పగలమని అన్నారు.




**మాకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లే..**

తెలంగాణ రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏంటి అనేది పరిశీలించాలి? ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారం ఇదంతా చేయించారా? అనేది తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుంది. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకొని సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలని అంటే అది తమకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్టుగా తాము ఈసీ ఎదుట వ్యక్తిగత విచారణ హాజరవాడానికి ముందే తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు. అప్పుడు మాత్రమే తాము సరైన సమాధానం చెప్పుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" అనే పేరును మేము పూర్తి సదుద్దేశంతో స్వతంత్రంగా ఆలోచించి పెట్టిన పేరు అని వివరించారు. "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని.. ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలి లేదని అన్నారు. రెండు పార్టీల పేర్ల మధ్య పోలికలను నిర్ధారించుకునేప్పుడు రాజకీయ పార్టీ యొక్క పూర్తి పేరును ఒకే సమగ్ర రూపంగా భావించాలని.. కానీ అందులోని విడి పదాలను ముక్కలు చేసి లేదా విడదీసి చూడకూడదన్నారు.

**మా పార్టీ పేరుకు ఏ పార్టీతోనూ పోలిక లేదు..**

ఎన్నికల కమిషన్ తమకు పంపిన అభ్యంతరాల్లోని "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్) (2024)", "తెలంగాణ రాజ్య సమితి" (2023) అనేవి వేర్వేరు పేర్లు.. విభిన్న ఉచ్చారణ, నిర్మాణం, గుర్తింపు, నాయకత్వం, సంస్థాగత శైలి తో పాటు ప్రజల్లో వేర్వేరు గుర్తింపు కలిగిన రాజకీయ పేర్లు అని వివరించారు. ఆ పేర్లతో "తెలంగాణ రక్షణ సేన"ను దాని సమగ్ర రూపంలో పరిశీలించినప్పుడు, అది పూర్తి భిన్నంగా, స్పష్టంగా గుర్తించదగిన రాజకీయ పార్టీగా తెలుస్తోందన్నారు.. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీతోనూ తమ పార్టీ పేరుకు పోలిక లేదన్నారు. గతంలో కూడా కేవలం ఒకే రకమైన భౌగోళిక వర్ణనాత్మక, సిద్ధాంతపరమైన పదాలు ఉన్నాయనే కారణంతో పార్టీ రిజిస్ట్రేషన్ నిరాకరించిన దాఖలాలు కూడా లేవని వివరించారు. ఒకే విధమైన పదాలతో సమాంతరంగా వేర్వేరు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దేశంలో వందల్లో ఉన్నాయని తెలిపారు. ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా, డెమొక్రాటిక్, సోషల్, రిపబ్లిక్ ఇండియా, శిరోమణి లాంటి పేర్లతో వందలాది పార్టీలు రిజిస్ట్రేషన్ పొంది ఉన్నాయన్న విషయం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపునిచ్చిన ఒకే విధమైన పేర్లు ఉన్న పార్టీల జాబితాను లేఖకు జత చేశారు. "తెలంగాణ రక్షణ సేన" పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కోరారు. అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమాధానం ఇవ్వడానికి తమకు తగినంత సమయం ఇచ్చాకే.. వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వివరాల వెల్లడి తర్వాత తమ వాదనలను సమర్థవంతంగా వినిపించడానికి, అభ్యంతరాలకు సరైన సమాధానం ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కేవలం సాధారణ భౌగోళిక వర్ణానాత్మక ఉనికిని బట్టి, ఊహాజనిత సంక్షిప్త రూపాల (Abbreviations) ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29A కింద ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" పార్టీ గుర్తింపు కోసం తాము చేసుకున్న దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.



# రాష్ట్ర పరిపాలనను అమ్ముకుంటున్న కాంగ్రెస్

జగిత్యాల, జూలై 12, సిరి న్యూస్:

"రాష్ట్ర పరిపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై నివేదికలు వచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే" అని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. జగిత్యాల పర్యటన సందర్భంగా ఆదివారం మీడియాతో మాట్లాడిన అరవింద్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యాశాఖ, రాష్ట్ర పరిపాలనపై ముఖ్యమంత్రికి కనీస అవగాహన లేదని ఆరోపించారు. పరిపాలనలో సమర్థత చూపాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ నివేదిక వచ్చినప్పటికీ బాధ్యులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు.

**కవిత ఆరోపణలపై విచారణ జరపాలి**

బీఆర్ఎస్ పార్టీ నిధులపై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆరోపణలని అరవింద్ అన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్, హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ప్రజల సొమ్ముతో రాజకీయాలు చేస్తున్నారనే ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎమ్మెల్యేపై విమర్శలు**

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై కూడా అరవింద్ విమర్శలు గుప్పించారు. కేంద్రీయ విద్యాలయానికి తగినంత భూమి కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర నిధుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రజాప్రతినిధులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

**బీజేపీయే ప్రత్యామ్నాయం**

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని అరవింద్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీజేపీ ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు

# "నీకు మా రక్తం కావాలా"..

- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు ఫైర్..
- "సీఎం వ్యాఖ్యలు సైకోలా, శాడిస్ట్‌లా ఉన్నాయి"
- "నీళ్లు పారించమంటే రక్తం పారిస్తారా?"
- "రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధం"
- "షాబాద్ ఘోరంపై సీఎం నోరు మెదపలేదు"
- "వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పండి"



హైదరాబాద్, సిరి న్యూస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శైలిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిన్న ఓ అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర సీఎం మాట్లాడిన మాటలు వింటుంటే సైకో లాగా, శాడిస్ట్ లాగా ఉందే తప్ప బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిలా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎండలకు ఎండిపోతున్న పొలాలకు నీళ్లు పారించమని ప్రతిపక్షాలు కోరుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం దానికి సమాధానం చెప్పకుండా నోటికి వచ్చినట్లు బూతులు పారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాటల్లో కేవలం అబద్ధాలు, బూతులు, శాపనార్థాలు తప్ప మరేమీ కనిపించడం లేదని ధ్వజమెత్తారు.

పొలాలకు నీళ్లు పారించమంటే.. ప్రతిపక్షాల రక్తం పారిస్తాం అంటూ ముఖ్యమంత్రి మాట్లాడటంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఉండి ప్రతిపక్షాల రక్తం అడుగుతారా? ప్రజల కోసం అవసరమైతే మా రక్తం ఇస్తాము. నిన్న షాబాద్‌లో జరిగిన ఘోర ఉదంతంలో నరహంతకుడైన రాజ్‌కుమార్‌కు, ఇలా రక్తం పారిస్తామంటున్న ఈ ముఖ్యమంత్రికి తేడా ఏంటి?" అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి కనీస విషయ పరిజ్ఞానం లేకపోవడం వల్లే ఇలాంటి అసభ్యకరమైన బూతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి షాబాద్ దారుణ ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం స్పందించి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తే, మన రాష్ట్ర సీఎం మాత్రం దానిపై నోరు మెదపకుండా రాజకీయ విమర్శలు, బూతులు మాట్లాడటానికే ప్రాధాన్యత ఇచ్చారని హరీష్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడిన అసభ్యకర వ్యాఖ్యలను ఒకసారి టీవీల్లో రివైండ్ చేసి చూసుకోవాలని, ఆ మాటలు విన్న తర్వాతైనా ఆయన రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "నీకు మా రక్తం కావాలా.. అయితే తీసుకో, దానికి మేము సిద్ధం. కానీ ఎండిపోతున్న రైతుల పొలాలకు మాత్రం తక్షణమే సాగునీరు పారించు" అని కోరారు.

# TG20 లీగ్ ఛాంపియన్ ఈ హైదరాబాద్

హైదరాబాద్, సిరి న్యూస్

టీజీ20 లీగ్ ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం ఏసెస్‌పై హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు ఘన విజయం సాధించి, టోర్నమెంట్ విజేతగా అవతరించింది. ఖమ్మం వేదికగా జరిగిన ఈ ఫైనల్ పోరులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం ఏసెస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఖమ్మం జట్టులో మికిల్ జైస్వాల్ 65 పరుగులతో అద్భుతమైన అర్ధసెంచరీ చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. అతనికి తోడుగా హిమతేజ 31 పరుగులు, విద్యానంద రెడ్డి 20 పరుగులు (నాటౌట్), ప్రతీక్ రెడ్డి 15 పరుగులు చేసి రాణించారు. అయితే హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఖమ్మం జట్టు భారీ స్కోరు చేయలేకపోయింది. హైదరాబాద్ బౌలర్లలో యశ్వీర్ గౌడ్ అత్యుత్తమంగా రాణించి 3 వికెట్లు పడగొట్టగా, దేవ్ మెహతా, అజయ్ గౌడ్ చెరో 2 వికెట్లు, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీసి ఖమ్మం రన్‌రేట్‌ను నియంత్రించారు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు కేవలం 17.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. హైదరాబాద్ జట్టుకు కెప్టెన్ అభిరథ్‌రెడ్డి 48 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి మరోసారి జట్టును ముందుండి నడిపించాడు. ఆ తర్వాత షణ్ముఖ అశ్విన్ 36 పరుగులతో రాణించగా, చివర్లో వైష్ణవ్‌రెడ్డి 41 పరుగులు, ప్రణవ్ వర్మ 19 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. వీరిద్దరూ అద్భుతమైన భాగస్వామ్యంతో మ్యాచ్‌ను మరో 14 బంతులు మిగిలి ఉండగానే ముగించారు. ఖమ్మం బౌలర్లలో హర్షిత్ సాయి, విద్యానందరెడ్డి, వేద్‌రెడ్డి, షేక్ అజర్ తలో వికెట్ తీసినప్పటికీ, హైదరాబాద్ బ్యాటర్లను అడ్డుకోవడంలో వారు విఫలమయ్యారు.




# స్థలాభావం కొరతకు సరికొత్త పరిష్కారం!

తెలంగాణ బ్యూరో జులై12,సిరి న్యూస్:

దక్షిణ మండలి విద్యుత్ సంస్థలో సంస్థ పట్టణాల్లో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు సఇబ్బందిగా పరిణమిస్తున్న భూసేకరణకు ప్రత్యామ్నాయం ప్రధాన అడ్డంకిగా మారుతున్న నేపత్యంలో వినూత్న నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో రవాణాకోసం వినియోగిస్తున్న ఫ్లైఓవర్ల కింద ఖాళీగా ఉన్న ప్రదేశాలలో సబ్ స్టేషన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది.అత్యాధునిక కాంపాక్ట్ సబ్‌స్టేషన్లను నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అధికారులతో ఇప్పటికే చర్చలు పూర్తిచేశారు .క్యూర్ పరిదిలోని 10 సర్కిల్ లలో 450 సబ్ స్టేషన్‌లు ఉండగా హైదరాబాద్ నగరంలో కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం 10 ప్రాంతాలను గుర్తించారు.మొదటి విడతలో మూడు చోట్ల సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం.

**గచ్చిబౌలి పరిసరాల్లో తొలి అడుగు**

మొదటి దశలో కొండాపూర్ ఆర్టీవో కార్యాలయ పరిధిలోని విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడ ఫ్లైఓవర్ 5961 పిల్లర్ల మధ్య ఒక కాంపాక్ట్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే 8వ బెటాలియన్, కొండాపూర్ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు కొత్తగూడ ఫ్లైఓవర్ 23 పిల్లర్ల మధ్య మరో సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. నల్లగండ్ల ప్రాంతానికి సంబంధించిన సబ్‌స్టేషన్‌ను గచ్చిబౌలి సమీపంలో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మూడు ప్రాజెక్టులకు త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

**అత్యల్ప స్థలం అత్యాధునికతో సబ్ స్టేషన్!**

ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లతో పోలిస్తే కాంపాక్ట్ సబ్‌స్టేషన్లు చాలా తక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేయవచ్చు. అత్యాధునికత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ సబ్‌స్టేషన్లు దుమ్ము, వర్షపు నీటి ప్రభావాన్ని తట్టుకునేలా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేయడం వల్ల నేరుగా వర్షం తగలకపోవడంతో విద్యుత్ పరికరాల భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు. షార్ట్‌సర్క్యూట్లు, విద్యుత్ ప్రమాదాల అవకాశాలు తగ్గడంతో పాటు నిర్వహణ కూడా సులభంగా ఉండనుంది.

**వ్యయం ఆదా !**

ఇకముందు హైదరాబాద్ లాంటి నగరాల్లో భూసేకరణ అవసరం లేకుండా ఇప్పటికే ఖాళీగా ఉన్న ఫ్లైఓవర్ల కింది స్థలాన్ని వినియోగించడం వల్ల ప్రాజెక్టుల వ్యయం, నిర్మాణ సమయం రెండూ తగ్గనున్నాయి. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. తొలి దశ విజయవంతమైతే గుర్తించిన మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా కాంపాక్ట్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఎస్పీడీసీఎల్ ప్రణాళిక సిద్ధం చేసింది.

# నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతావా..

- కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తుచేసిన బీఆర్ఎస్ నేత
- రైతుల కోసం రక్తమైనా ఇస్తామన్న కేటీఆర్
- ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్ సిరి న్యూస్

రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు సాగునీరు అందించాలంటూ డిమాండ్ చేసిన ప్రతిపక్షాల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా అత్యంత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అంటవా.. రక్త పిశాచీ! ఇంకా తీరలేదా మీ రక్త దాహం?" అంటూ కాంగ్రెస్ పాలనను ఆయన కడిగిపారేశారు. గత 60 ఏళ్లుగా తెలంగాణను పీడించి, ఇక్కడి బిడ్డల రక్తాన్ని తాగిన కాంగ్రెస్ తోడేలుకు ఇంకా ఎంత రక్తం కావాలని నిలదీశారు. తెలంగాణ పిల్లలను పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి, ఎన్‌కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన నరహంతక చరిత్ర కాంగ్రెస్‌దని మండిపడ్డారు. 1952లో ఏడుగురు యువకులను, 1969లో 369 మంది ముద్దుబిడ్డలను తూటాలతో బలితీసుకున్న ఖూనీకోర్లు మీరేనని, మలిదశ పోరాటంలోనూ వేయిమంది బలిదానాలకు కాంగ్రెస్ మృగాలే కారణమని, ఆ పార్టీ చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిసిపోయాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ రక్కసి కోరలకు అంటిన తెలంగాణ నెత్తుటి మరకలు ఎప్పటికీ చెరిగిపోవని, రైతుల కోసం తాము ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. పేగులు తెగేదాకా రాష్ట్రం కోసం కొట్లాడి, నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన చరిత్ర తమదని గుర్తుచేశారు. "నెత్తురు ఇస్తేనే.. నీళ్లు ఇస్తాం అని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే మా నెత్తురు ధారపోస్తాం.. మీ రక్తదాహం తీర్చుకోని, ఎండిపోతున్న పొలాల జలదాహం తీర్చండి" అంటూ రైతుల పక్షాన నిలబడి ఎంతటి త్యాగానికైనా తాము వెనకాడబోమని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.



# భువనగిరి–చిట్యాల నాలుగు లేన్ల రోడ్డుకు శంకుస్థాపన

- రూ.339.59 కోట్లతో పనుల ప్రారంభం
- 109.3 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన
- భువనగిరి-చిట్యాల ఫోర్ లేన్ రోడ్డుకు మోక్షం
- తగ్గనున్న ప్రయాణ సమయం, పెరగనున్న భద్రత
- వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపు

రామన్నపేట, సిరి న్యూస్ :

రామన్నపేటలో ఆదివారం స్టేజ్-1, ప్యాకేజ్-2/7లో భాగంగా రూ.339.59 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 109.3 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనగిరి నుంచి చిట్యాల వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, భువనగిరి-చిట్యాల నాలుగు లేన్ల రహదారి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, రహదారి పూర్తయితే జిల్లాలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని పేర్కొన్నారు. అలాగే వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# హరీష్ రావుకు రక్తం చిందించే ధైర్యం లేదు..

- **నాడు పెట్రోల్ పోసుకున్నారు కానీ అగ్గిపెట్టె తెచ్చుకోలేదు: జగ్గారెడ్డి ఎద్దేవా**
- **కేసీఆర్, హరీష్‌కు క్షమాపణ డిమాండ్**
- **కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటు కౌంటర్**
- **ఈటెల రాజేందర్‌పైనా విమర్శలు**
- **తుంగతుర్తి వివాదంపై స్పందన**

**తెలంగాణ, సిరి న్యూస్**

కాళేశ్వరం ప్రాజెక్టు , సాగునీటి అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణమైన కేసీఆర్, హరీష్ రావులు ముందు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృధా చేసి, రాష్ట్రానికి భారీ నష్టం చేకూర్చినందుకు గానూ ముక్కు నేలకు రాసి, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు.



**హరీష్ రావుకు రక్తం చిందించే ధైర్యం లేదు**

రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోస్తామంటూ కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను జగ్గారెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. హరీష్ రావును రక్తం చిందించమని చెప్పినా ఆయన ఆ పని చేయరని, అసలు రక్తం చిందించే అంత ధైర్యం హరీష్‌కు లేదని ఎద్దేవా చేశారు. "తెలంగాణ ఉద్యమం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఎంతోమంది యువకులు బలిదానాలు చేసుకున్నారు. ఆ సమయంలో హరీష్ రావు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్టు డ్రామా ఆడాడు కానీ.. అగ్గిపెట్టె మాత్రం తెచ్చుకోలేదు. పెట్రోల్ తెచ్చుకున్న వాడు అగ్గిపెట్టె తెచ్చుకోలేడా?" అంటూ జగ్గారెడ్డి తీక్షణమైన ప్రశ్నలు సంధించారు. తమకు నచ్చినట్టు నడుచుకోకపోతే అవతలి వారిని సైకోలు అంటారా అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏదో ఒక రకంగా నిందించాలనే ఒకే ఒక్క లైన్ పెట్టుకుని హరీష్ రావు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో హింసకు, రెచ్చగొట్టే స్వభావానికి కేసీఆర్ ఇల్లే కేరాఫ్ అడ్రస్ అని, ఆ లక్షణాలు వారి కుటుంబానికే చెల్లుతాయని ఆరోపించారు.

**బీజేపీ నేత ఈటెలకు చురకలు**

కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ (NDSA) నిపుణుల కమిటీ ఏం చెబితే అది చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. నేరుగా ఎన్‌డీఎస్‌ఏ దగ్గరికే వెళ్లి తేల్చుకుందాం రమ్మంటే హరీష్ రావు నుండి ఎలాంటి స్పందన లేదని నిలదీశారు. ఇదే సమయంలో బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌పై కూడా జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. గతంలో ఈటెల ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు కాబట్టే, ఇప్పుడు లోపాయికారీగా బీఆర్ఎస్ నేతలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "నువ్వు ఇప్పుడు బీజేపీలో కీలకమైన పదవిలో ఉన్నావు కదా.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కేసీఆర్, హరీష్ రావులను ఢిల్లీకి తీసుకువెళ్లు. మా కాంగ్రెస్ మంత్రులు కూడా వస్తారు. అంతేకానీ అది చేయకుండా ఇక్కడ వృధాగా ఎందుకు మాట్లాడుతున్నావు?" అని ఈటెలకు హితవు పలికారు. రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, మాట ఇస్తే నిలబెట్టుకోవడం తమ రాజకీయ సంస్కృతి అని, అది బీఆర్ఎస్, హరీష్ రావుల సంస్కృతి కాదని స్పష్టం చేశారు.

**తుంగతుర్తి పంచాయితీపై జగ్గారెడ్డి వ్యాఖ్యలు**

ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారిన తుంగతుర్తి నియోజకవర్గ పంచాయితీపై కూడా జగ్గారెడ్డి స్పందించారు. ప్రస్తుతం తుంగతుర్తి వ్యవహారానికి సంబంధించిన పోస్ట్‌మార్టం (పరిశీలన) జరుగుతోందని, అక్కడ తలెత్తిన సమస్యలను ఎలా సెట్ చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాజకీయాల్లో కోపతాపాలు సహజమని, నియోజకవర్గానికి చెందిన అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. దీనిపై రేపటికల్లా తుది నివేదిక (రిపోర్ట్) సిద్ధం చేసి పార్టీ అధిష్టానానికి అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పంచాయితీలు, గొడవలు రావడం చాలా సహజమని, "పంచాయితీలు అంటేనే కాంగ్రెస్" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల్లోనూ గొడవలు ఉంటాయని, కాకపోతే తమ పార్టీ వాళ్లు ఏమైనా ఉంటే బహిరంగంగా బయట మాట్లాడతారని, మిగిలిన పార్టీల నేతలు మాత్రం లోపల మాట్లాడుకుంటారని.. కేవలం ఆ ఒక్కటే తమకు, మిగతా వారికి ఉన్న తేడా అని జగ్గారెడ్డి వివరించారు.

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి ఫైర్

- **రైతుల కోసం రక్తమిస్తామన్న జగదీశ్**
- **రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలని డిమాండ్**

**సూర్యాపేట, సిరి న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం తాము ప్రాణాలను పణంగా పెట్టి పోరాటంలోకి వచ్చామని గుర్తుచేసిన ఆయన, తమ రక్తంతో పంటలు పండుతాయని ప్రజలు భావిస్తే రైతుల కోసం రక్తం ఇవ్వడానికి కేసీఆర్‌తో పాటు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. 'సూపర్ ఎల్ నినో' ప్రభావంతో కరువు వచ్చే ముప్పు ఉందని, నీటిని ఎత్తిపోయాలని తాము నెత్తీనోరూ బాదుకుంటున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడినవన్నీ శుద్ధ అబద్ధాలని రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయిందని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలు పక్కనబెట్టి రైతులను ఆదుకోవాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద దాదాపు 10 టీఎంసీల నీరు వృధాగా పోతున్నా ప్రభుత్వం ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు. గోదావరి ఉధృతికి భద్రాచలం కొట్టుకుపోతుందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, ఆయన మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని మండిపడ్డారు. రైతుల పొలాలకు నీళ్లివ్వడం చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే విపక్షాలపై బురదజల్లుతోందని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.



# తుంగతుర్తి కాంగ్రెస్ పంచాయితీకి తెర.. జగ్గారెడ్డితో ఎమ్మెల్యే మందుల సామెల్ భేటీ.!

- **జగ్గారెడ్డితో ఎమ్మెల్యే సామెల్ భేటీ**
- **మండల అధ్యక్షుల నియామకంపై చర్చ**
- **17న పూర్తి క్లారిటీ ఇవ్వనున్న సామెల్**

**హైదరాబాద్, సిరి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన తుంగతుర్తి నియోజకవర్గ వివాదానికి ఎట్టకేలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. వివాదాల పరిష్కారానికి ఏఐసీసీ (AICC) నియమించిన పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డితో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఆదివారం సుదీర్ఘంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ నేతల మధ్య తలెత్తిన విభేదాలు, మండల అధ్యక్షుల నియామకంపై ఈ సమావేశంలో లోతుగా చర్చించారు. భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారాన్ని 'ఇద్దరు అన్నదమ్ముల మధ్య వచ్చిన భేదాభిప్రాయాలు'గా అభివర్ణించారు. నియోజకవర్గంలో అక్కడక్కడా కొన్ని గొడవలు జరిగిన మాట వాస్తవమేనని, అయితే వాటన్నింటినీ సద్దుమణిగేలా చూస్తామని స్పష్టం చేశారు.

**మండల అధ్యక్షుల నియామకం..**
**ఎమ్మెల్యే అప్పీల్**

ఏఐసీసీ ఆదేశాల మేరకే తుంగతుర్తి నియోజకవర్గంలో 9 మంది మండల అధ్యక్షుల నియామకం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు. అయితే ఇందులో 3 మండలాల నియామకాల్లో కొంత తేడాలు ఉన్నాయని, కొందరు నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. "ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను నేనే స్వయంగా చక్కదిద్దుకుంటానని, తనకు కొంత సమయం ఇవ్వాలని ఎమ్మెల్యే మందుల సామెల్ ఏఐసీసీ, పీసీసీ (PCC) లకు అప్పీల్ చేసుకున్నారు. ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిని నేను పీసీసీ అధిష్టానానికి నివేదిక రూపంలో అందిస్తాను" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎవరి ప్రాధాన్యత ఎలా ఉంటుందో స్పష్టం చేస్తూ.. ప్రోటోకాల్ ప్రకారం నియోజకవర్గంలో ఎమ్మెల్యేకే మొదటి అధికారం ఉంటుందని, స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి రెండవ అభిప్రాయం (ప్రాధాన్యత) ఉంటుందని, అలాగే జిల్లా నాయకుల పక్షాన డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఉంటారని తేల్చి చెప్పారు.

**సీనియర్లకు గౌరవం ఇవ్వాలి..**
**ఎవరి ప్రభావం లేదు**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను తాము ఎల్లప్పుడూ గౌరవించుకోవాలని జగ్గారెడ్డి సూచించారు. అయితే తుంగతుర్తి అంతర్గత వ్యవహారాల్లో వారెవరూ జోక్యం చేసుకోలేదని (ఇవాల్వ్ కాలేదని) స్పష్టం చేశారు. తనను కూడా ఈ విషయంలో ఎవరూ ప్రభావితం చేయలేదని, నిష్పక్షపాతంగానే అందరి అభిప్రాయాలను సేకరించానని తెలిపారు. గత పది రోజులుగా సాగుతున్న ఈ ఎపిసోడ్‌లో నియోజకవర్గ నేతలందరి భావాలను, అసంతృప్తులను తాను స్వయంగా నోట్ చేసుకున్నానని.. ఈ రోజుతో తుంగతుర్తిలో గొడవలకు స్వస్తి పలకాలని నేతలకు గట్టిగా హితవు పలికారు.

**16న ఫైనల్ రిపోర్ట్.. 17న క్లారిటీ**


ఈ పంచాయితీని పూర్తిగా సెట్ చేయడానికి ఎమ్మెల్యే మందుల సామెల్ ఈ నెల 15వ తేదీ వరకు సమయం అడిగారని జగ్గారెడ్డి వెల్లడించారు. "వచ్చే గురువారం (ఈ నెల 16వ తేదీ) సాయంత్రం నేను, ఎమ్మెల్యే మందుల సామెల్, పీసీసీ చీఫ్, బసవరాజు సారయ్య కలిసి కూర్చుని తుది చర్చలు జరుపుతాం. ఆ తర్వాత పూర్తి నివేదికను అధిష్టానానికి సమర్పిస్తాం. అనంతరం, ఈ నెల 17న ఎమ్మెల్యే సామెల్ స్వయంగా మీడియాతో మాట్లాడి అన్ని విషయాలపై పూర్తి స్పష్టత ఇస్తారు" అని జగ్గారెడ్డి ప్రకటించారు. దీంతో గత కొద్దిరోజులుగా తుంగతుర్తి కాంగ్రెస్‌లో నడుస్తున్న హైడ్రామాకు త్వరలోనే శుభం కార్డు పడనుందని అర్థమవుతోంది.

# కాళేశ్వరంపై కేసీఆర్ బయటకు వచ్చి మాట్లాడాలి: అద్దంకి దయాకర్ సవాల్

- **ఇంట్లో కూర్చోవడానికేనా కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత పదవి ఇచ్చింది?**
- **లక్షల కోట్ల ప్రజాధనం వృథా అవుతుంటే చూస్తూ ఊరుకోలేం.**
- **ఎన్డీఎస్ఏ (NDSA) నివేదికను పక్కనబెట్టి హరీశ్ రావు డ్రామాలు ఆడుతున్నారు.**
- **దమ్ముంటే అసెంబ్లీకి రావాలి, లేదంటే కాళేశ్వరం దొంగలుగా మిగిలిపోతారు.**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ :**

ఇంట్లో ఉండడానికి కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడి పదవి ఇచ్చారా? కాళేశ్వరం డిజైన్ చేసి కేసీఆర్ బయటకు వచ్చి మాట్లాడాలని శాసనమండలిలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. లక్షల కోట్ల ప్రజాధనం వృథా చేసిన తీరు చూసి మాకు రక్తం మరుగుతోందని, కాళేశ్వరం పైన ఒక్క నిమిషం మాట్లాడే నైతిక అర్హత హరీశ్ రావుకు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం బ్యారేజీలు అక్కడ కట్టొద్దని రిటైర్ ఇంజనీర్లు గతంలో ఇచ్చిన రిపోర్ట్‌ను ఎందుకు కేసీఆర్ పక్కన పెట్టాడడని, బ్యారేజీ నింపితే రక్షణ లేదని చెపుతుంటే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఇవ్వమని హరీష్ రావు చెపుతున్నాడని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్ హౌస్ దగ్గర నీళ్లు ఎక్కడున్నాయి, ఎన్డీఎస్ఏ మాటలు నమ్మాలా? హరీష్‌రావు లాంటి దొంగల మాటలు వినాలా? తొమ్మిదిన్నర ఏళ్లలో నాలుగేళ్లు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఆయన ఉన్నాడు, మూడు నెలలు ఇస్తే ఏం చేస్తాడని ప్రశ్నించారు.





**సీఎం రేవంత్ రెడ్డి మ్యాప్ వేసి చూపించినా..**

సీఎం రేవంత్ రెడ్డి మ్యాప్ వేసి చూపించినా వీళ్లకి అర్థం కావడం లేదని, బ్యారేజీలు కూలిపోతాయని చెపుతుంటే నీళ్లు ఎత్తిపోయాలని మాట్లాడుతున్నాడని అద్దంకి దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్‌ను చివర కట్టమని చెప్పింది ఎవరు? నీళ్లు ఎక్కడ ఉంటాయో అక్కడ పుట్ బాల్ ఉండాలన్నారు. కేసీఆర్ ఒప్పుకుంటే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి కాళేశ్వరంపైన చర్చించడానికి మేం సిద్ధమని, అసెంబ్లీలో చర్చకు రాకుంటే కాళేశ్వరం దొంగలుగా భావించాల్సి వస్తుందని అద్దంకి దయాకర్ విమర్శించారు. కేసీఆర్ దొంగ దీక్ష చేశారని రికార్డులు చెపుతున్నాయని, శ్రీకాంతా చారి కిరోసిన్ పోసుకుని తగలబడితే, హరీశ్ రావు కిరోసిన్ పోసుకున్నా ఎందుకు తగలబడలేదు? హరీశ్ రావు కిరోసిన్ డ్రామా వల్ల అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు కూడా కేసీఆర్ పార్లమెంటులో లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు అడ్రస్ లేదని, ఈటెల రాజేందర్ కేసీఆర్ పాట పాడుతున్నాడని అద్దంకి దయాకర్ మండిపడ్డారు. హరీశ్ రావును బీజేపీ లోకి తీసుకెళ్లడానికి ఈటెల రాజేందర్ ప్రయత్నం చేస్తున్నాడో, లేక ఆడ ఏమీ లేదని ఈటెలను బీఆర్ఎస్ లోకి తెచ్చేందుకు హరీశ్ రావు ప్రయత్నం చేస్తున్నాడో అని ఆయన ఆరోపించారు. ప్రాణహిత చేవేళ్లను చెడగొట్టి కాళేశ్వరం పెట్టుకున్నారని, అంబేద్కర్ పేరు ఉందని ప్రాణహితను పక్కన పెట్టారని అద్దంకి దయాకర్ ఆరోపించారు.

**ఇద్దరి పాత్ర కూడా అంతే..**

తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీయడంలో కేసీఆర్ పాత్ర ఎంత ఉందో, హరీశ్ రావు పాత్ర కూడా అంతే ఉందని, ఆయనవన్నీ అబద్ధపు మాటలని టీపీసీసీ ఫిషర్‌మెన్ చైర్మన్, మెట్టు సాయి కుమార్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిల్లర మాటలు మాట్లాడే హరీష్ రావుకు రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని, రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా ఉందన్నారు. ఇప్పటికైనా హరీశ్ రావు చిల్లర మాటలు బంద్ చేయాలని మెట్టు సాయికుమార్ హితవు పలికారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- **ఎల్ఈడీ డిజిటల్ వాహనాలతో వినూత్న అవగాహన ప్రచారం**
- **రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థలపై పోలీసుల ప్రత్యేక నిఘా**
- **పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం అలర్ట్‌గా ఉండాలి**
- **డ్రగ్స్ సమాచారం కోసం 1908 టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ ఏర్పాటు**

EAGLE FORCE
TELANGANA
ELITE ACTION GROUP
FOR DRUG LAW ENFORCEMENT

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర పోలీసులు వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. సోషల్ మీడియాకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కల్పించేందుకు ఎల్ఈడీ డిస్‌ప్లే వాహనాలతో వినూత్న ప్రచారం చేస్తున్నారు. నగరంలోని రామగోపాల్‌పేట, నల్లగుట్ట, ఎం.ఎస్. మఖ్తా, లేక్ వ్యూ, సచివాలయం పరిధిలోని కీలక ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలోని పోలీసు బృందం రద్దీ ప్రాంతాలను ఎంచుకుని ఈ సామాజిక ప్రచారాన్ని బలోపేతం చేస్తోంది.

**పిల్లల కదలికలపై నిఘా ఉంచాలి**

ఈ ప్రచారంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, బస్ స్టాప్‌ల వద్ద ఎల్ఈడీ డిజిటల్ వాహనాలను ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, అవి జీవితాలను ఎలా ధ్వంసం చేస్తాయో వివరించే ప్రభావవంతమైన వీడియోలు, ప్రకటనలను ఈ వాహనాల ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులు, నిత్యం ప్రయాణించే కూలీలు, ఉద్యోగులు అందరికీ ఈ సందేశం చేరేలా డిజిటల్ ప్రదర్శనలతో పాటు కాలనీలు, పార్కులు, విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున కరపత్రాల పంపిణీ, పోస్టర్ల ఏర్పాటు చేపట్టారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచడంలో పౌరుల పాత్ర ఎంత కీలకమో పోలీసులు ఈ సందర్భంగా వివరిస్తున్నారు. ముఖ్యంగా సచివాలయం వంటి పరిపాలనా కేంద్రాల వద్ద సాయంత్రం వేళల్లో ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులను సైతం చైతన్యపరచడమే దీని ముఖ్య ఉద్దేశం. నివారణకు అవగాహనే మొదటి మెట్టు అని, సమాజంలో బలమైన ప్రతిఘటన ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారిని అడ్డుకోగలమని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో పోలీసులు చేస్తున్న ఈ కృషి పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. యువత పెడదారి పడుతున్న ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసులు కోరుతున్నారు.

**వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం**

మాదకద్రవ్యాల సరఫరా లేదా వాడకానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఈగల్ ఫోర్స్ విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం 1908 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు, 87126 71111 వాట్సాప్ నంబర్‌ను, tsnabhohyd@tspolice.gov.in ఈమెయిల్ ఐడీని అందుబాటులోకి తెచ్చారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, నమ్మదగిన సమాచారం ఇచ్చిన వారికి తగిన బహుమతులు కూడా అందజేస్తామని పోలీసులు ప్రకటించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, యువతను ఈ వ్యసనాల నుంచి కాపాడటమే తమ ప్రాధాన్యతని పోలీసులు పునరుద్ఘాటించారు.

# షాబాద్ హంతకుడి హైడ్రామా!

- **షాబాద్ హంతకుడు రాజ్‌కుమార్ వేటలో విస్తుపోయే నిజాలు**
- **పెట్రోల్ అయిపోవడంతో కారును వదిలేసిన రాజ్‌కుమార్**
- **రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం విఫలం**
- **3 ఫోన్లు, 12 సిమ్ కార్డులతో తప్పించుకునే ప్లాన్**
- **శ్రీశైలం, బెంగళూరు మార్గాల్లో పోలీసుల గాలింపు**

**రంగారెడ్డి, సిరి న్యూస్**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని నరమేధం సృష్టించిన ఉదంతంలో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ కోసం పోలీసులు జరిపిన గాలింపు చర్యల్లో అత్యంత ఆసక్తికరమైన, ఉత్కంఠభరితమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నప్పటికీ, అతను పోలీసుల కళ్లు గప్పుతూ సాగిస్తున్న తప్పించుకునే పర్వం తీవ్ర సస్పెన్స్‌ను రేకెత్తిస్తోంది.

**కారులో పెట్రోల్ ఖాళీ.. రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం డ్రామా**

హత్యలు చేసిన అనంతరం పోలీసుల నుండి తప్పించుకోవడానికి రాజ్‌కుమార్ కారులో వేగంగా పరారయ్యాడు. అయితే, చేగూరు ప్రాంతానికి చేరుకునే సరికి కారులో పెట్రోల్ అయిపోవడంతో విధిలేక వాహనాన్ని అక్కడే వదిలేశాడు. అక్కడ నుండి కాలినడకన తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఒక రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ, చివరి నిమిషంలో ధైర్యం సరిపోక చచ్చేందుకు భయపడి ట్రాక్ కిందకు దూకేశాడు. ఆ తర్వాత అతను అక్కడి నుండి ఎటు వైపు వెళ్లాడు, ఎక్కడ తలదాచుకున్నాడు అనేది పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.



**3 ఫోన్లు.. డజనుకు పైగా సిమ్ కార్డులు**

రాజ్‌కుమార్ సాధారణ నేరస్థుడిలా కాకుండా పక్కా ప్లానింగ్‌తో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అతని వద్ద సుమారు మూడు మొబైల్ ఫోన్లు, డజనుకు పైగా (12 కి పైగా) వేర్వేరు సిమ్ కార్డులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు తనను పసిగడతారనే భయంతో ప్రస్తుతం అతను ఆ ఫోన్లను, సిమ్ కార్డులను వాడటం లేదని నిర్ధారణ అయ్యింది. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడైనా ఒక సిమ్ కార్డ్ ఆన్ చేసినా వెంటనే పట్టుకోవాలనే వ్యూహంతో పోలీసులు అతనికి సంబంధించిన అన్ని నంబర్లను ప్రతిక్షణం సైబర్ సెల్ సహాయంతో ట్రాక్ చేస్తున్నారు.

**శ్రీశైలంతో పాటు బెంగళూరు హైవేపై పోలీసుల గాలింపు**

నిందితుడి వేట కోసం పోలీసులు ఏకంగా 12 ప్రత్యేక బృందాలను (Teams) రంగంలోకి దించారు. ఇప్పటికే తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్ల సీసీటీవీ (CCTV) ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. రాజ్‌కుమార్‌కు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రెగ్యులర్‌గా వెళ్లే అలవాటు ఉందని విచారణలో తేలడంతో.. అతను అక్కడ సాధువుల రూపంలో గానీ, భక్తుల మధ్య గానీ దాక్కునే అవకాశం ఉందని భావించి శ్రీశైలంలో ప్రత్యేక బృందాలు మోహరించాయి. దీనితో పాటు బెంగళూరు హైవే పరిసర ప్రాంతాలు , పొరుగు రాష్ట్రాలలో కూడా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.



## ఆదర్శ్ రెడ్డి కుటుంబ సభ్యుల నుంచి ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ..

**రామచంద్రపురం, జూలై 12 (సిరి న్యూస్):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి నివాసాన్ని బూత్ లెవల్ అధికారులు ఆదివారం సందర్శించి, ఆయన కుటుంబ సభ్యులు పూర్తి చేసిన ఎస్ఐఆర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా భారతి నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను ధ్రువీకరించుకుని, అవసరమైన పత్రాలతో పూర్తి చేసిన ఎస్ఐఆర్ దరఖాస్తులను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సాయిలు, సూపర్వైజర్ నారాయణ, బూత్ లెవల్ ఆఫీసర్ సరిత, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిపై హరీష్ రావు వ్యాఖ్యలు ఖండనీయం..

- **రేవంత్ రెడ్డికి వెంటనే క్షమాపణలు చెప్పాలి: కొల్కురి నరసింహ రెడ్డి**

**పటాన్‌చెరు, జూలై 12 (సిరి న్యూస్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు తన్నీరు హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు ఖండనీయమని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కురి నరసింహ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిని షాబాద్ హత్య కేసు నిందితుడితో పోల్చడం బాధ్యతాయుత రాజకీయాలకు తగదన్నారు. బీఆర్ఎస్ పాలనలో వామన్‌రావు దంపతుల హత్య, నేరెళ్ల ఘటన వంటి సంఘటనలు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వం ఎందుకు బాధ్యత వహించలేదో హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, శ్రీనివాస్, రతన్ సింగ్, అంజయ్య, మల్లేష్, ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.





## దుర్గమ్మ దీవించమ్మ

**పాపన్నపేట్ జూలై 12 సిరి న్యూస్ :**

ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గ భవాని ఆలయం వద్ద ఆదివారం రోజు భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి పంచామృతాలతో అర్చకులు అభిషేకాలు చేసి అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటూ అమ్మవారి కృప ఉండాలని కోరుకుంటూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలైన్లు భక్తులు వేచి ఉన్నారు. ఎండ తీవ్రత ఉండటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. క్యూ లైన్ లో కనీస తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.







### సిరి న్యూస్ ఎఫెక్ట్.! స్పందించిన అధికార యంత్రాంగం..

# సమస్యకు పరిష్కారం దొరికేనా.?..

- **సిరి న్యూస్ కథనాలతో కదిలిన యంత్రాంగం.!..**
- **రంగంలోకి దిగిన డిప్యూటీ కమిషనర్..**
- **బీఎల్‌వోలకు స్పష్టమైన ఆదేశాలు.!..**
- **మీ నిర్లక్ష్యంపై వరుసగా వార్తలు వస్తున్నాయి.. హెచ్చరిక.!..**
- **ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశం.!..**
- **ఓటర్లకు ఇబ్బందులు కలిగితే బాధ్యత బీఎల్‌వోలదేనని స్పష్టం..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 12 ( సిరి న్యూస్ ):**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియ అమలులో చోటుచేసుకుంటున్న నిర్లక్ష్యాన్ని సిరి తెలుగు దినపత్రిక వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో అధికార యంత్రాంగం స్పందించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ నేరుగా వార్డు కార్యాలయానికి చేరుకుని సమీక్ష నిర్వహించారు..





**మీ నిర్లక్ష్యంపై వరుసగా వార్తలు.. డిసి హెచ్చరిక..**

సమీక్ష సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడిన డిప్యూటీ కమిషనర్, మీ నిర్లక్ష్యంపై వరుసగా వార్తలు వస్తున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలి" అంటూ స్పష్టమైన హెచ్చరిక జారీ చేసినట్లు సమాచారం. ప్రతి అర్హుడైన ఓటరు ఇంటికే వెళ్లి అక్కడికక్కడే ఎస్ఐఆర్ నమోదు పూర్తి చేయాలని, ప్రజలను రోడ్డుపైకి పిలిపించి దరఖాస్తులు స్వీకరించడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు వచ్చే అవకాశం ఇవ్వకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు..

**సర్..ఇంటింటికీ నమోదు చేయాల్సిందే.! డిసి ఆదేశాలు..**

వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, నిరక్షరాస్యులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. వారి ఇళ్ల వద్దకే వెళ్లి దరఖాస్తులను పరిశీలించి ఎన్నికల సంఘం సూచించిన మొబైల్ యాప్ ద్వారా వెంటనే నమోదు పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలని, నిబంధనలను విస్మరించినట్లయితే సంబంధిత బీఎల్‌వోలపైనే పూర్తి బాధ్యత ఉంటుందని హెచ్చరించినట్లు తెలిసింది.

**సిరి న్యూస్ కథనాల ప్రభావం..**

ఇటీవలి రోజుల్లో ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో కొందరు బీఎల్‌వోలు రోడ్డుపక్కనే కుర్చీలు వేసుకుని ప్రజలను తమ వద్దకు పిలిపించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఫారాలు ఇచ్చి వెళ్లండి... తర్వాత నమోదు చేస్తాం అంటూ వెనక్కి పంపిస్తున్నారని, దీంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, నిరక్షరాస్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ వ్యవహారంపై ఫోటోలు, వీడియోలతో సహా సిరి తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. అనంతరం అధికార యంత్రాంగం స్పందించి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది..

**క్షేత్రస్థాయిలో మార్పు వస్తుందా.?**

డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో సమస్య పరిష్కారానికి తొలి అడుగు పడినప్పటికీ, ఇకపై నిజంగానే ప్రతి బీఎల్‌వో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ నమోదు పూర్తి చేస్తారా.? ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందా.? అనే ప్రశ్నలకు రానున్న రోజుల్లో సమాధానం లభించనుంది. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా సిరి తెలుగు దినపత్రిక ప్రజల పక్షాన తన నిఘాను కొనసాగిస్తుందని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో భద్రంగా నమోదయ్యే వరకు ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూనే ఉంటుందని స్పష్టం చేస్తోంది..

# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా మారండి

- **బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు**

**కుత్బుల్లాపూర్, జూలై12, సిరి న్యూస్**



ఆపద సమయాల్లో ఉన్నవారికి యువత మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు పిలుపునిచ్చారు. తలసేమియా అండ్ సిక్లే సెల్ సొసైటీ వారు.. చింతల్‌లోని శోభన డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఆర్థోపెటిక్ డాక్టర్ సాయిచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి డాక్టర్ దాసి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని అభినందించి.. వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ శిబిరంలో సుమారు 80 మందికి పైగా రక్త దానం చేశారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ సాయిచంద్రను డాక్టర్ దాసి నాగరాజు అభినందించారు. అనంతరం డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానం అని.. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 70 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కనీసం 20 మంది రోజు మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం బారిన పడిన వారందరికీ రక్తం అవసరమని, గర్భిణీ స్త్రీలకు కూడా రక్తం అవసరమని, క్యాన్సర్ పేషెంట్లు, తలసీమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు కూడా రక్త మార్పిడి కోసం అవసరమని తెలియజేస్తూ.. యువత రక్త దానం చేయడం ద్వారా ప్రాణ దాతలుగా మారాలని, సామాజిక సామాజిక స్పృహతో, సామాజిక బాధ్యతతో దేశభక్తితో ఈ కార్యక్రమాన్ని తరచూ ఏర్పాటు చేయాలని డాక్టర్ సాయిచంద్రను కోరారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను డాక్టర్ దాసి నాగరాజు అభినందిస్తూ, వారి సేవాభావాన్ని కొనియాడారు. సమాజానికి రక్తదాతలు అందిస్తున్న అమూల్యమైన సేవ ఎంతో గొప్పదని పేర్కొంటూ, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసు, డాక్టర్ సాయి చంద్ర, స్నేహితులు, శ్రేయోభిలాషులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ వేదికపై మంచిర్యాల జెండా..

- **జాతీయ స్థాయిలో మంచిర్యాల విద్యార్థుల సత్తా..**
- **13 మందికి స్వర్ణ పతకాల పంట..**
- **విజేతలను అభినందించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్..**
- **పెన్‌కాక్ సిలాట్‌లో జిల్లా ఘన విజయం..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12 (సిరి న్యూస్)**

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో మంచిర్యాల జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జూన్ 25 నుంచి 28 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న 13 మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించి జిల్లా ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. ఈ సందర్భంగా విజేతలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అభినందించారు. క్రీడాకారుల ప్రతిభను కొనియాడుతూ, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించేలా మరింత కృషి చేయాలని సూచించారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్‌కాక్ సిలాట్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాసరి రాజేశ్వర్, శిక్షకుడు పోచంపల్లి వెంకటేశ్, రాష్ట్ర సాంకేతిక విభాగం అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కోశాధికారి మెయిన్ పాల్గొని విజేత విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన శిక్షకులను కూడా ప్రశంసించారు. ఈ విజయంతో జిల్లాకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## కుంగ్ ఫూతో ఆత్మరక్షణ

- **ఆత్మరక్షణలో ప్రతిభ చాటిన కుంగ్ ఫూ విద్యార్థులు.**
- **బెల్ట్‌లు, ధ్రువపత్రాలతో విజేతలకు ఘన సత్కారం.**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12 (సిరి న్యూస్)**

మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో కుంగ్ ఫూ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు ఉత్సాహంగా నిర్వహించారు. మాస్టర్ జెట్టి కృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి మందమర్రి పట్టణ సహాయ ఉప నిరీక్షకుడు మిలన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పసుపు, ఆకుపచ్చ, మెరూన్ బెల్టులతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్, అసిస్టెంట్ మాస్టర్ హరికృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయసు నుంచే ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని, క్రీడలు శారీరక, మానసిక వికాసంతో పాటు చదువులోనూ మెరుగైన ఫలితాలకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్లు రాజేష్, శ్రీనివాస్, టి. రవి, చందు, శ్రీనివాస్, శ్రీధర్, ప్రభాకర్, ఎంఎల్ రవి పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పిల్లలను ప్రోత్సహించారు.







# రాఘవేంద్రరావును ఘనంగా సన్మానించిన జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి

**వెల్దుర్తి, జులై 12, (సిరి న్యూస్)**

వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు, మణికొండ రాఘవేంద్ర రావు గతంలో మంగళపర్తి ( గ్రామ సర్పంచ్ ) గా ఎన్నో సేవలందించారు. అదేవిధంగా లైన్స్ క్లబ్ మెంబర్ గా ఆయన సేవలు ఉమ్మడి జిల్లాలో నిరుపేదలకు అందించారు. ఈ మధ్యనే తెలంగాణ ప్రభుత్వం యాదగిరిగుట్ట ఆలయ కమిటీలో రాఘవేంద్ర రావుకు కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్న గారి నరేందర్ రెడ్డి ఆదివారం నాడు ఆయన నివాస గృహానికి చేరుకొని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మెంబర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి అలాగే మంత్రులకు ఆలయ కమిటీ చైర్మన్ కు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిమ హాస్పిటల్స్‌లో ఆరు రోజుల మెగా హెల్త్ క్యాంప్..

- **ఈనెల 13 నుంచి 18 వరకు ఉచిత వైద్య సేవలు..**
- **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుల విజ్ఞప్తి..**

**రామచంద్రపురం, జూలై 12 (సిరి న్యూస్):**

మయూరి నగర్, బీరంగూడలో ఉన్న మహిమ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగనుంది. ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలియజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిమ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ, నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలను ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో నిపుణులైన వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించనున్నట్లు చెప్పారు. పటాన్‌చెరు, బీరంగూడ, మయూరి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## రాజ్యాంగం కల్పించిన ఓటును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి

**రాయికోడ్ , (సిరి న్యూస్):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సిరియస్ గా తీసుకొని ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోలని సూచించారు. ప్రతి ఒక్క ఓటర్లకు మండల ప్రజాప్రతినిధులు సూచనాలు ఇవ్వాలని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం ఉండకుండా BLA లు బూతుల వారీగా రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఓటర్లతో సమన్వయం చేసుకొని ఈ నెల 24 లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పూర్తి అయినా ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసేందుకు బూత్ లేవల్ అధికారుల బిఎల్వోలకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డా.. రాజీవ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య,జగన్ మోహన్ రెడ్డి,సతీష్, సుధాకర్ రెడ్డి,రాంరెడ్డి, కేదార్నాథ్ పాటిల్,సిద్దన్న పాటిల్,బసరాజ్ పాటిల్,మహంకాళీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, మండల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ కళ్యాణమే భారతీయ సంస్కృతి

# మూల సూత్రం: ఈటెల రాజేందర్

- **సనాతన ధర్మం ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప సందేశమని వ్యాఖ్య**
- **యువతకు భారతీయ విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్న ఎంపీ**
- **మానసిక ప్రశాంతతే నిజమైన సంపద అని అభిప్రాయం**
- **భారత్ నేషనలిస్ట్ ఫోరం వార్షికోత్సవంలో పాల్గొన్న ఈటెల**

**హైదరాబాద్, జూలై 12, (సిరి న్యూస్):**

"లక్షలాది మంది సాధు సంతులు ఈ దేశమే తమ కుటుంబమని, మానవ కళ్యాణమే తమ జీవిత లక్ష్యమని సేవ చేస్తున్నందువల్లే నేటికీ సమాజంలో ప్రశాంతత నెలకొంది. ప్రపంచానికి సనాతన ధర్మం, మానవ సంక్షేమ భావనను అందించిన దేశం భారతదేశమే" అని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.

ఎల్బీనగర్‌లోని సువర్ణ భారతి గోశాలలో నిర్వహించిన భారత్ నేషనలిస్ట్ ఫోరం మూడో వార్షికోత్సవ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం గొప్పతనంపై ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారత్ అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించే అవకాశాన్ని కల్పించిన దేశమని పేర్కొన్నారు.

**భారతీయ విలువలను కాపాడుకోవాలి**

సర్వేజన సుఖినోభవంతు అనే భావన భారతీయ సంస్కృతికి ప్రతీక అని ఈటెల రాజేందర్ అన్నారు. ప్రపంచానికి సనాతన ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను అందించిన ఘనత భారతదేశానిదేనని పేర్కొన్నారు. పాశ్చాత్య ప్రభావంతో యువత భారతీయ విలువలకు దూరం కాకుండా కుటుంబ వ్యవస్థ, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**మానసిక ప్రశాంతతే అసలైన సంపద**

సమాజ అభివృద్ధికి ఆర్థిక సంపద ఒక్కటే ప్రమాణం కాదని, మానసిక ప్రశాంతత ఉన్న దేశమే నిజమైన సంపన్న దేశమని ఈటెల అభిప్రాయపడ్డారు. దేశాన్ని కేవలం ప్రభుత్వాలే కాదు, ధర్మం, సంస్కృతి, సామాజిక విలువలు కూడా రక్షిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ, హాజీబు శ్రీనివాసరావు, చౌడవరపు కరుణాకర్, కుండకూల యాదయ్య, భారత్ నేషనలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## ఆలయ నిర్మాణానికి కాట శ్రీనివాస్ గౌడ్ విరాళం!

**జిన్నారం జులై 12 సిరి న్యూస్**

జిన్నారం పురపాలిక పరిధిలోని ఇమామ్ నగర్ గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని గ్రామ ప్రజలందరూ కలిసి అత్యంత వైభవంగా పండుగ వాతావరణం లో నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కాట శ్రీనివాస్ గౌడ్ విరాళం ఈ మహత్కార్యంలో భాగస్వామ్యం అవుతూ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

భక్తుల కోలాహలం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కళ్లారా చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకు ఉంది.

ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ గౌడ్, రఘు, నరేందర్ గౌడ్, సత్యనారాయణ, జగన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి దామోదర్ రాజనర్సింహ అభివృద్ధితో కాంగ్రెస్‌లోకి సుల్తాన్

**మునిపల్లి, జూలై 12 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడైన డాక్టర్ సుల్తాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మునిపల్లి మండల అధ్యక్షుడు పిల్లోడి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మాజీ ఎంపీటీసీ పాండు, పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా నాయకులు సుల్తాన్ మాట్లాడుతూ, అందోల్ నియోజకవర్గంలో గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులు మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వంలో రెండేళ్లలోనే వేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. మునిపల్లి చౌరస్తా-ఖమ్మంపల్లి రహదారి, కంకోల్-తాటిపల్లి-పెద్దలోడి-గార్లపల్లి-చిల్లపల్లి రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయని, తకడపల్లి వంతెన నిర్మాణం 75 శాతం పూర్తైందన్నారు. మరియు ఇందిరమ్మ ఇళ్లు, ఫ్రీ బస్ పథకం, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీతో పాటు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, అందుకే డాక్టర్ సుల్తాన్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

# కాళేశ్వరం పునరుద్ధరణలో ప్రభుత్వం విఫలం

- **సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగ లేఖ**
- **మూడు బ్యారేజీల పునరుద్ధరణలో తీవ్ర జాప్యమని విమర్శ**
- **మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్**
- **విజిలెన్స్ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలి**

**హైదరాబాద్, జూలై 12, (సిరి న్యూస్):**

"కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్‌డీఎస్ఏ సిఫారసులను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాంచందర్ రావు బహిరంగ లేఖ రాశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని ఆయన విమర్శించారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో పనులు పూర్తి చేసేందుకు తగిన సమయం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సూచించిన సాంకేతిక పరీక్షలు, పునరుద్ధరణ చర్యలను సకాలంలో అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమని పేర్కొన్నారు.

**రైతులకు తీవ్ర నష్టం**

మూడు బ్యారేజీల పునరుద్ధరణ ఆలస్యం కావడంతో గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం కోల్పోయామని రాంచందర్ రావు ఆరోపించారు. ముఖ్యంగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తక్కువ నష్టం జరిగినప్పటికీ వాటిని ముందుగా పునరుద్ధరించి ఉంటే ఉత్తర తెలంగాణలో 20 నుంచి 25 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలకు తాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ కేవలం సాంకేతిక మార్గదర్శకత్వం మాత్రమే ఇస్తుందని, అమలు బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**నివేదికలు బహిర్గతం చేయాలి**

విజిలెన్స్ కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. నివేదికలో పేర్కొన్న వారిపై ఇప్పటివరకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో కూడా ప్రభుత్వం హైకోర్టులో సమర్థంగా వాదించలేదని ఆరోపించారు.

**మొత్తం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలి**

మూడు బ్యారేజీల అంశానికే సీబీఐ విచారణను పరిమితం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని రాంచందర్ రావు ప్రశ్నించారు. రూ.1.30 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై, పంప్ హౌస్‌లు, కాల్వలు, టన్నెల్లు, రిజర్వాయర్లు సహా అన్ని నిర్మాణాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆయన తన బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు.

# ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు కాదు

- **కార్మికుల హక్కుల కోసం పి.శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి.**
- **తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ఎప్పటికీ మరువలేనిది.**
- **సమాజ సేవలో ఆయన మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాం.**
- **టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్తమ రెడ్డి**

**మెదక్**

**జూలై,12(సిరి న్యూస్)**




ఉద్యోగ విరమణ తప్పనిసరి..చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కార్మికుల హక్కుల సాధనలో పి.శ్రీనివాస్ రెడ్డి సేవలు ఎనలేనివి.తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన పాత్ర అమోఘమని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్తమ రెడ్డి కొనియాడారు. ఆదివారం మెదక్ పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్ లో అకౌంటెంట్ గా ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డి సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.దశాబ్దాలపాటు నిజాయితీతో విధులు నిర్వహించి అకౌంటెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన పి.ఎస్. శ్రీనివాస్ రెడ్డికి సహోద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వాత్తమ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగం నుంచి పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, సమాజానికి చేసిన సేవలే శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సేవ, కార్మిక సంక్షేమం, తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర అందరికీ ఆదర్శమని అన్నారు.కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల కోసం న్యాయబద్ధంగా పోరాడడం, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండడం వంటి అంశాల్లో శ్రీనివాస్ రెడ్డి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు.ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యోగులు, కార్మికులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఉద్యోగ జీవితమంతా పారదర్శకత, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి సహోద్యోగుల అభిమానాన్ని సంపాదించారని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, టిఎంయూ రాష్ట్ర నాయకులు థామస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ ఇంచార్జీ తిరుపతి రెడ్డి,ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కృష్ణా రెడ్డి, మేడి రాధా కిషన్ రావ్, శాఖయ్య, దశరథ్ రెడ్డి, అశ్వక్ హైమద్ లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు,ఉద్యోగ సంఘాల నాయకులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఒత్తిడిని జయించండిలా..!

వ్యక్తిగత జీవితం, ఉద్యోగ జీవితం సమన్వయం చేసుకొనే క్రమంలో చాలా మంది ఒత్తిడికి గురవుతుంటారు. స్ట్రెస్, డిప్రెషన్ అనేవి అనేక ఇతర వ్యాధులకు కూడా కారణం అవుతున్నాయి. తాత్కాలికమైన ఒత్తిడి వల్ల కొన్ని లాభాలున్నప్పటికీ.. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్తున్నారు. అసలు ఈ ఒత్తిడిని ఎలా జయించాలి? మానసిక నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం.



## ధ్యానంతో రిలాక్స్


రోజుకు కొన్ని నిమిషాలపాటు ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. ప్రశాంతమైన మ్యూజిక్ వినడంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది. పచ్చదనం ఉన్న ప్రాంతంలో వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. నిరంతర వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. వ్యాయామం చేసే సమయంలో ఎండార్ఫిన్ విడుదలవుతుంది. దీన్ని ద్వారా ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.


## ముందుగా ఒత్తిడిని గుర్తించండి


ఒత్తిడిని జయించాలంటే ఒత్తిడి ఎందుకు వచ్చిందో తెలుసుకోవడం మొదటి అడుగు. ముందు ఒత్తిడి కలిగించే వ్యక్తులు, పరిస్థితులను అధ్యయనం చేయాలి. అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా చూసుకోవాలి. మీకు ఒత్తిడి కలిగించే వ్యక్తులకు దూరంగా ఉండాలి.

## ఆరోగ్యకరమైన ఆహారం కూడా..

ఒత్తిడిని జయించాలంటే పండ్లు, కూరగాయలు, మాంసాహారాలు, తృణ ధాన్యాలు తీసుకోవాలి. అధిక కాఫీ, మద్యపానాలు, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు సైతం ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం బెటర్. ఇక ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడటం.. పుస్తకాలు చదవడం ద్వారా కూడా ఒత్తిడిని జయించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.









# లెమన్ ఆయిల్‌తో ఒత్తుగా జుట్టు


జుట్టుగా ఒత్తుగా ఉండాలన్నది అందరి కల. కానీ ప్రస్తుత జీవనశైలి, పని ఒత్తిడి తదితర కారణాలతో జుట్టు రాలుతూనే ఉంది తప్ప.. ఒత్తుగా ఉండటం లేదు. చాలా చిన్నవయసులోనే బట్ట తల కూడా వచ్చేస్తోంది. ఇక స్త్రీలకు పొడవైన జుట్టు.. అందమైన కురులు చక్కటి అందాన్ని ఇస్తాయి. కానీ ఇప్పుడు పొడగాటి, ఒత్తైన జుట్టు ఎక్కడా కనిపించడం లేదు. ఇక జుట్టును ఒత్తుగా ఉంచుకోవడానికి రకరకాల ఆయిల్స్, క్రీములు, షాంపూలు మార్చేస్తుంటారు. కానీ ఎన్ని ట్రై చేసినా జుట్టు మాత్రం పెరగడం లేదన్నదని యువత భావన. అయితే ఇప్పుడు బ్యుటిషియన్స్ లెమన్ ఆయిల్ తో జుట్టును ఒత్తుగా పెంచుకోవచ్చని ఓ సరికొత్త సలహా ఇస్తున్నారు. అసలు ఈ లెమన్ అయిల్ ఎలా వాడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. లెమన్ ఆయిల్ తో మీ తల మీద ఉన్న చుండ్రు, ఇతర వ్యర్థాలను తొలగించుకోవచ్చు. ఇక డ్యాండ్రఫ్, పొడి జుట్టును తగ్గించడంతోనూ ఈ ఆయిల్ సహాయపడుతుంది. లెమన్ ఆయిల్ తలలో రక్త రక్తప్రవాహాన్ని పెంచుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. తద్వారా జుట్టు మూలాలకు అవసరమైన పోషకాలు, ఆక్సిజన్ అందుతుందట. లెమన్ ఆయిల్ లో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో జుట్టు శక్తి మరింత ఇనుమడిస్తుంది.

## మసాజ్ ఎలా చేసుకోవాలి?

లెమన్ ఆయిల్‌ను కొద్దిగా నెయ్యిలో కలపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తల మీద 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేయాలి. 30 నిమిషాల అలాగే వదిలేసి రసాయనాలు లేని షాంపూతో తల స్నానం చేయాలి. ఇలా నిత్యం వాడటం వల్ల జుత్తు నిగనిగలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. లెమన్ ఆయిల్ ను నేరుగా అప్లై చేయొద్దని.. మిశ్రమంగానే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.



# వర్షా కాలంలో ఈ కూరగాయలు బెస్ట్



వర్షా కాలంలో కొన్ని కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు తరుముకొస్తుంటాయి. చిన్నపిల్లలు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. అయితే వర్షా కాలంలో కొన్ని రకాల కూరగాయాలు తీసుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కూరగాయలు పుష్కలంగా పోషకాలను అందిస్తుంటాయి. జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. ఈ కూరగాయలు మీరు ఆహారంలో చేర్చుకుంటే వర్షా కాలంలో ఆరోగ్యంగా ఉండడంలో సహాయపడతాయి.



**కాకరకాయ:** రోగనిరోధక శక్తిని పెంచడంలో, కాలేయాన్ని శుభ్రపరచడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**ఆనపకాయ:** ఈ కూరగాయలో ఉన్న నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది మరియు ఇది తేలికగా జీర్ణమవుతుంది.

**పొట్లకాయ:** ఇది మంచి డైటరీ ఫైబర్ అందిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

**బచ్చలికూర:** అధిక ఐరన్ కంటెంట్ రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

**మెంతి ఆకులు:** ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.

**మునగకాయలు:** రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మరియు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**క్యారెట్లు:** బీటా కెరోటిన్, విటమిన్ ఏ మరియు యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది, ఇవి దృష్టిని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తాయి.

**బీట్రూట్:** అధిక ఐరన్ కంటెంట్‌తో రక్తహీనతను నివారించడంలో, మరియు శక్తి స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది.

**గుమ్మడికాయ:** విటమిన్ ఏ, సీ, ఈ, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది మరియు జీర్ణక్రియకు సహాయపడుతుంది.

**బెండకాయ:** విటమిన్లు ఏ, సీ, ఫోలేట్, మరియు ఫైబర్ ఉన్నంత మాత్రాన ఇది మంచి జీర్ణక్రియను ఉంచుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది.

ఈ కూరగాయలు మీ వర్షాకాల ఆహారంలో చేర్చుకుంటే, అవి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ఈ సీజన్‌లో ప్రత్యేకమైన రోగనిరోధక ప్రయోజనాలను అందిస్తాయి.

# లార్డ్స్‌లో యస్తికా చరిత్ర



**భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చారిత్రక ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో అరుదైన రికార్డు సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో శతకం సాధించి, లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది.**

### టెస్ట్ శతకంతో తొలి మహిళా క్రికెటర్‌గా అరుదైన ఘనత

### గాయం నుంచి కోలుకుని పునరాగమన మ్యాచ్‌లోనే సెంచరీ

### లార్డ్స్ ఆనర్స్ బోర్డులో భారత క్రికెటర్ పేరు

**లండన్:** భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చారిత్రక ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో అరుదైన రికార్డు సృష్టించింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో శతకం సాధించి, లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. మూడో రోజు లంచ్ విరామానికి 91 పరుగులతో క్రీజులో ఉన్న యస్తికా, విరామం అనంతరం కూడా అదే జోరును కొనసాగించింది. ఇస్సీ వాంగ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన ఆమె, ఆపై సింగిల్‌తో తన తొలి అంతర్జాతీయ టెస్ట్ శతకాన్ని పూర్తి చేసింది. 145 బంతుల్లో 12 ఫోర్ల సహాయంతో ఈ సెంచరీ నమోదు చేసింది. శతకం పూర్తికాగానే భావోద్వేగానికి గురైన యస్తికా మైదానంలో మోకాళ్లపై కూర్చొని పిచ్‌ను ముద్దాడగా, ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లతో ఆమెను అభినందించారు. మోకాలి ఏసీఎల్ గాయంతో కొంతకాలం క్రికెట్‌కు దూరమైన యస్తికా, ఈ ఇంగ్లండ్ పర్యటన ద్వారానే అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి అడుగుపెట్టింది. పునరాగమన మ్యాచ్‌లోనే చారిత్రక శతకం బాది తన సత్తాను మరోసారి నిరూపించింది. ఇన్నింగ్స్ తొలి బంతికే లారెన్ బెల్ బౌలింగ్‌లో వికెట్లను బంతి తాకినా బెయిల్స్ కిందపడకపోవడంతో ఆమెకు అదృష్టం కలిసి వచ్చింది. ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఇదే మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసి ఇప్పటికే లార్డ్స్ ఆనర్స్ బోర్డులో చోటు దక్కించుకున్న భారత బౌలర్ క్రాంతి గౌడ్ సరసన, యస్తికా కూడా టెస్ట్ శతకంతో తన పేరును లార్డ్స్ చరిత్రలో చిరస్థాయిగా నిలిపింది.

# టీమిండియా మేనేజ్‌మెంట్‌పై కైఫ్ ఆగ్రహం

**ఎంపికల తీరుపై తీవ్ర విమర్శలు**



ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత జట్టు 0-4 తేడాతో ఓటమిపాలైన నేపథ్యంలో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ జట్టు మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇంత గందరగోళంగా వ్యవహరించిన జట్టు యాజమాన్యాన్ని తాను చూడలేదని పేర్కొన్నాడు. ముఖ్యంగా సంజూ శాంసన్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ విషయంలో అనుసరించిన విధానం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత్, వరుస పరాజయాలతో తీవ్ర నిరాశకు గురైంది. తొలుత ఐర్లాండ్‌తో 0-2 తేడాతో సిరీస్ కోల్పోయిన జట్టు, అనంతరం ఇంగ్లండ్ చేతిలో 0-4తో క్లీన్‌స్వీప్‌కు గురైంది. ఈ ఫలితాలతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో కైఫ్ తన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రపంచ స్థాయి ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం కల్పించాల్సిందిపోయి, వారి మనసుల్లో సందేహాలు నింపేలా జట్టు ఎంపికలు జరిగాయని విమర్శించాడు. సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత అతడిని తప్పించి వైభవ్ సూర్యవంశీని ఆడించారని, చివరి మ్యాచ్‌లో మళ్లీ వైభవ్‌ను పక్కనపెట్టి సంజూను తీసుకురావడం అర్థం కాని నిర్ణయమని పేర్కొన్నాడు. అదే సమయంలో జింబాబ్వే సిరీస్‌కు సంజూను ఎంపిక చేయకుండా వైభవ్‌ను కొనసాగించడం మరింత గందరగోళానికి దారితీసిందని వ్యాఖ్యానించాడు. ఇదే అంశంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కూడా స్పందించాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శనల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేయడం సరైన పద్ధతి కాదని సెలక్టర్లకు సూచించాడు. విదేశీ పరిస్థితుల్లో రాణించే సామర్థ్యం ఉన్న ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇవ్వాలని, స్వదేశంలో మాత్రమే పరుగులు చేయడం సరిపోదని అభిప్రాయపడ్డాడు.



## పరాజయాల్లో టీమిండియా చెత్త రికార్డు

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా మరోసారి నిరాశపరిచింది. సౌతాంప్టన్ వేదికగా జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. దీంతో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల పరంగా భారత్ ఎదుర్కొన్న అతిపెద్ద పరాజయాల్లో ఈ ఓటమి నాలుగో స్థానంలో నిలిచింది. టీ20ల్లో భారత్‌కు అత్యంత భారీ ఓటమి 2026లో నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్ చేతిలో 125 పరుగుల తేడాతో నమోదైంది. అనంతరం 2019లో వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్ చేతిలో 80 పరుగుల తేడాతో, 2026లో అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తాజాగా సౌతాంప్టన్‌లో ఇంగ్లండ్‌పై 56 పరుగుల తేడాతో ఓడిపోవడంతో ఈ పరాజయం నాలుగో అతిపెద్ద ఓటమిగా నమోదైంది. 2025లో న్యూ చండీగఢ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 51 పరుగుల తేడాతో ఎదురైన ఓటమి ఈ జాబితాలో తర్వాతి స్థానంలో ఉంది. ఈ ఇంగ్లండ్ పర్యటనలో భారత్ మరో అవాంఛనీయ రికార్డును కూడా తన పేరిట నమోదు చేసుకుంది. ఒకే టీ20 సిరీస్ లేదా టోర్నమెంట్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం భారత టీ20 చరిత్రలో ఇదే తొలిసారి. గతంలో 2009లో ఇంగ్లండ్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌లు, 2010లో వెస్టిండీస్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌లు, 2023లో వెస్టిండీస్ పర్యటనలో మూడు మ్యాచ్‌లు మాత్రమే భారత్ ఓడిపోయింది. ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలో నాలుగు పరాజయాలతో ఆ చెత్త రికార్డును అధిగమించింది. టీ20 ప్రపంచకప్ విజేతగా బరిలోకి దిగిన భారత జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. వరుస పరాజయాలతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలు, నాయకత్వంపై సోషల్ మీడియాలో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జట్టులో మార్పులు అవసరమని, రాబోయే సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శనతో ఈ వైఫల్యాల నుంచి బయటపడాలని మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## టీమిండియా మేనేజ్‌మెంట్‌పై కైఫ్ ఆగ్రహం

**ఎంపికల తీరుపై తీవ్ర విమర్శలు**




ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత జట్టు 0-4 తేడాతో ఓటమిపాలైన నేపథ్యంలో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ జట్టు మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇంత గందరగోళంగా వ్యవహరించిన జట్టు యాజమాన్యాన్ని తాను చూడలేదని పేర్కొన్నాడు. ముఖ్యంగా సంజూ శాంసన్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ విషయంలో అనుసరించిన విధానం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత్, వరుస పరాజయాలతో తీవ్ర నిరాశకు గురైంది. తొలుత ఐర్లాండ్‌తో 0-2 తేడాతో సిరీస్ కోల్పోయిన జట్టు, అనంతరం ఇంగ్లండ్ చేతిలో 0-4తో క్లీన్‌స్వీప్‌కు గురైంది. ఈ ఫలితాలతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ నేపథ్యంలో కైఫ్ తన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రపంచ స్థాయి ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం కల్పించాల్సిందిపోయి, వారి మనసుల్లో సందేహాలు నింపేలా జట్టు ఎంపికలు జరిగాయని విమర్శించాడు. సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత అతడిని తప్పించి వైభవ్ సూర్యవంశీని ఆడించారని, చివరి మ్యాచ్‌లో మళ్లీ వైభవ్‌ను పక్కనపెట్టి సంజూను తీసుకురావడం అర్థం కాని నిర్ణయమని పేర్కొన్నాడు. అదే సమయంలో జింబాబ్వే సిరీస్‌కు సంజూను ఎంపిక చేయకుండా వైభవ్‌ను కొనసాగించడం మరింత గందరగోళానికి దారితీసిందని వ్యాఖ్యానించాడు. ఇదే అంశంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కూడా స్పందించాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శనల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేయడం సరైన పద్ధతి కాదని సెలక్టర్లకు సూచించాడు. విదేశీ పరిస్థితుల్లో రాణించే సామర్థ్యం ఉన్న ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇవ్వాలని, స్వదేశంలో మాత్రమే పరుగులు చేయడం సరిపోదని అభిప్రాయపడ్డాడు.



## టాస్‌లలో శ్రేయస్ రికార్డు

**ధోనీ సరసన చేరిన టీమిండియా కెప్టెన్**

టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత కెప్టెన్‌గా వరుసగా అత్యధిక టాస్‌లు గెలిచిన సారథిగా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రికార్డును సమం చేశాడు. ఇంగ్లండ్‌తో సౌతాంప్టన్‌లో జరిగిన ఐదో టీ20లో టాస్ గెలవడంతో శ్రేయస్ వం-సగా ఏడో టాస్ విజయాన్ని నమోదు చేశాడు. 2010 నుంచి 2012 మధ్య ధోనీ భారత జట్టుకు నాయకత్వం వహిస్తూ వరుసగా ఏడు టీ20 మ్యాచ్‌ల్లో టాస్ గెలిచాడు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ కూడా అదే ఘనత సాధించి ధోనీ సరసన అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ వరుసగా ఆరు టాస్ విజయాలతో తర్వాతి స్థానంలో ఉండగా, ధోనీ మరోసారి 2007లో వరుసగా ఐదు టాస్‌లు గెలిచాడు. రోహిత్ శర్మ కూడా 2020 నుంచి 2022 మధ్య వరుసగా ఐదు టాస్ విజయాలు నమోదు చేశాడు. అయితే టాస్‌లలో అదృష్టం కలిసి వస్తున్నా, మ్యాచ్ ఫలితాలు మాత్రం శ్రేయస్‌కు అనుకూలంగా మారడం లేదు. సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ వేదికగా జరిగిన ఐదో టీ20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. దీంతో సౌతాంప్టన్‌లో ఇటీవల టీ20ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టే గెలుస్తున్న ఆనవాయితీ మరోసారి కొనసాగింది. 2021 నుంచి ఈ వేదికపై జరిగిన ఐదు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే విజయం సాధించింది. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఇప్పటివరకు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాడు. ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా, ఆరు మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోయింది. మరో మ్యాచ్ ఫలితం లేకుండానే ముగిసింది. అయితే మరో మ్యాచ్‌లో కూడా టాస్ గెలిస్తే వరుసగా ఎనిమిది టాస్ విజయాలతో భారత టీ20 కెప్టెన్లలో కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం శ్రేయస్ అయ్యర్‌కు ఉంది.



## రిఫరీతో మెస్సీ వాగ్వాదం

**ప్రపంచకప్ మ్యాచ్‌లో ఉద్రిక్తత**

**న్యూజెర్సీ, జులై 12:** 2026 ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా, స్విట్జర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగడమే కాకుండా మైదానంలో తీవ్ర ఉద్రిక్తతకు కూడా వేదికైంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, మ్యాచ్ రిఫరీ జోవావో పిన్హీరో మధ్య జరిగిన వాగ్వాదం ఫుట్‌బాల్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. అదనపు సమయంలో అర్జెంటీనా విజయం సాధించినప్పటికీ, మెస్సీ ఆగ్రహావేశం మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మొదటి అర్ధభాగంలో స్విట్జర్లాండ్‌కు ఫ్రీకిక్ లభించిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అర్జెంటీనా ఏర్పాటు చేసిన రక్షణ గోడలో ఉన్న మెస్సీని నిబంధనల ప్రకారం కొంత వెనక్కి జరగాలని రిఫరీ సూచించారు. అయితే రిఫరీ మాట్లాడిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మెస్సీ, తనతో మర్యాదగా మాట్లాడాలని, అగౌరవంగా ప్రవర్తించవద్దంటూ గట్టిగా హెచ్చరించినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ప్రపంచకప్‌లో తొలిసారి గోల్ చేయడంలో విఫలమైన మెస్సీ మ్యాచ్ మొత్తం తీవ్ర ఒత్తిడిలో కనిపించాడు. స్విట్జర్లాండ్ ఆటగాళ్లు అతనిపై కట్టుదిట్టమైన మార్కింగ్ అమలు చేయడంతో ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. నిర్ణీత సమయంలో ఇరు జట్లు ఒక్కో గోల్‌తో సమంగా నిలవడంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. మ్యాచ్‌లో మరో వివాదాస్పద ఘటన కూడా చోటుచేసుకుంది. వీడియో సమీక్ష అనంతరం డైవింగ్ చేసినట్లు గుర్తించిన రిఫరీ, స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలోకు రెడ్ కార్డ్ చూపించి మైదానం వీడేలా చేశారు. దీంతో స్విస్ జట్టు పది మంది ఆటగాళ్లతోనే పోరాడాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అర్జెంటీనా అదనపు సమయంలో వరుసగా రెండు గోల్స్ చేసి 3-1 తేడాతో విజయాన్ని అందుకుంది. పోర్చుగల్‌కు చెందిన 38 ఏళ్ల జోవావో పిన్హీరో యూరప్‌లోని ప్రముఖ రిఫరీలలో ఒకరిగా గుర్తింపు పొందారు. 2015లో పోర్చుగీస్ అగ్రశ్రేణి లీగ్‌లో రిఫరీగా అరంగేట్రం చేసిన ఆయన, 2016లో ఫిఫా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. యూరోపియన్ క్లబ్ టోర్నీలతో పాటు పలు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీల్లో విధులు నిర్వహించిన అనుభవంతో 2026 ప్రపంచకప్‌కు ఎంపికయ్యారు. అయితే మెస్సీతో జరిగిన ఈ వాగ్వాదం కారణంగా ఆయన పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# నటుడు ఆర్యపై మోసం కేసు నమోదు



**హైదరాబాద్, జులై 12 :** ప్రముఖ తమిళ నటుడు ఆర్యతో పాటు ఆయన నటిస్తున్న 'అనంతన్ కాడు'లిచిత్ర బృందంపై హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మోసం కేసు నమోదైంది. సినిమా చిత్రీకరణ కోసం అద్దెకు తీసుకున్న అత్యాధునిక డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలకు సంబంధించిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలు చెల్లించకుండా మోసగించారని 'తాహెర్ సినీ టెక్నిక్' సంస్థ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఫిబ్రవరిలో 'అనంతన్ కాడు' సినిమా చిత్రీకరణ కోసం నటుడు ఆర్య, నిర్మాత వినోద్ తమ సంస్థను సంప్రదించి అత్యంత ఖరీదైన డిజిటల్ కెమెరాలు, లైటింగ్ పరికరాలను అద్దెకు తీసుకున్నారు. ఈ పరికరాల అద్దె మొత్తం రూ.2.12 కోట్లుగా నిర్ణయించగా, అందులో కొంత మొత్తం మాత్రమే చెల్లించి మిగిలిన రూ.1.80 కోట్లకు పైగా బకాయిలను ఇప్పటి వరకు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సినిమా విడుదలకు ముందు మొత్తం బకాయిలు చెల్లించి 'బకాయిలు లేవు' అనే ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటామని చిత్ర బృందం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే ఆ తర్వాత పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందించలేదని, ఫోన్ కాల్స్, సందేశాలను కూడా పట్టించుకోకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా బకాయిల విషయమై మాట్లాడేందుకు వెళ్లిన తమ సంస్థ మేనేజర్‌ను నటుడు ఆర్య, నిర్మాత వినోద్, ఆర్య వ్యక్తిగత సహాయకుడు కిశోర్ కలిసి బెదిరింపులకు గురిచేశారని సంస్థ అకౌంటెంట్ జావేద్ అలీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి కేరళలోని న్యాయస్థానం నుంచి మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందినట్లు సంస్థ ఆరోపించింది. ఫిర్యాదు ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు మోసం, బెదిరింపులకు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఒప్పందాలు, చెల్లింపుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# 'ఐరన్ లెగ్' ముద్రపై భాగ్యశ్రీ ఆవేదన



టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తనపై సోషల్ మీడియాలో వస్తున్న 'ఐరన్ లెగ్' వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సినిమా విజయం లేదా పరాజయానికి కేవలం కథానాయికను మాత్రమే బాధ్యురాలిగా చేయడం సరైన విధానం కాదని ఆమె స్పష్టం చేశారు. తాను నటిగా తన పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన బాధ్యత అని పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన భాగ్యశ్రీ, ఒక కథను అంగీకరించిన తర్వాత కూడా సినిమా నిర్మాణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. చిత్రీకరణ సమయంలో కథ, కథనం, సన్నివేశాలు, ఇతర అంశాల్లో మార్పులు జరగడం సహజమేనని, అలాంటి విషయాలు నటీనటుల నియంత్రణలో ఉండవని వివరించారు. అందువల్ల సినిమా ఫలితాన్ని ఒక్క కథానాయికపై మోపడం సమంజసం కాదని అన్నారు. సినిమా విజయానికి లేదా అపజయానికి అనేక అంశాలు కారణమవుతాయని, కథ, దర్శకత్వం, కథనం, సాంకేతిక నైపుణ్యం, ప్రేక్షకుల అభిరుచి వంటి అంశాలన్నీ ప్రభావం చూపుతాయని భాగ్యశ్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో సినిమా ఆశించిన ఫలితం సాధించకపోతే హీరోయిన్లకు 'అరిష్టం' లేదా 'ఐరన్ లెగ్' అనే ముద్ర వేయడం బాధాకరమని పేర్కొన్నారు. అయితే నటిగా తన పాత్రను సరిగా పోషించకపోతే ప్రేక్షకులు విమర్శించే హక్కు ఉందని ఆమె అన్నారు. తన నటనలో లోపాలు ఉంటే ఎలాంటి విమర్శలనైనా స్వీకరిస్తానని, వాటి నుంచి నేర్చుకుని మరింత మెరుగైన నటిగా ఎదగడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. కానీ సినిమా ఫలితాన్ని పూర్తిగా తనపై నెట్టేయడం మాత్రం న్యాయం కాదని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన తన తాజా చిత్రం 'లెనిన్' విజయోత్సవ కార్యక్రమంలో కూడా భాగ్యశ్రీ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. వేదికపైనే కన్నీటి పర్యంతమైన ఆమె మాటలు అక్కడున్న వారిని కదిలించాయి. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో సినీ అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. సినిమా విజయం, అపజయాలకు ఒక్క నటినే బాధ్యురాలిని చేయడం సరికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# ఆరోగ్య సమస్యల వల్లే బరువు పెరిగాను

ప్రముఖ యాంకర్, నటి రష్మీ గౌతమ్ తన శరీరాకృతిపై ఇటీవల వస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. తాను బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించానని, కోలుకున్న తర్వాత మళ్లీ మునుపటిలా ఫిట్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు. తెలుగు బుల్లితెరపై ప్రముఖ యాంకర్‌గా గుర్తింపు పొందిన రష్మీ గౌతమ్ ప్రస్తుతం పలు వినోదాత్మక కార్యక్రమాలతో పాటు ఓ ప్రముఖ ఓటీటీ వేదికలో ప్రసారమవుతున్న ప్రతిభా వేట కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రచారంలో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఒక వ్యాఖ్యాత, ఇటీవల కాలంలో మీరు కాస్త బొద్దుగా కనిపిస్తున్నారనే అభిప్రాయాలపై స్పందించాలని కోరగా, రష్మీ తన మనసులోని మాటను వెల్లడించారు. తాను ఇలా కనిపించడం తనకూ ఇష్టం లేదని, అయితే కెమెరాలో కనిపించే రూపం నిజ జీవితంలో ఉ ండే రూపానికి కొంత భిన్నంగా ఉంటుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో కెమెరా ప్రభావం వల్ల కూడా వ్యక్తులు వాస్తవం కంటే లావుగా కనిపించే అవకాశం ఉంటుందని వివరించారు. అయితే తన విషయంలో బరువు పెరగడానికి ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని రష్మీ వెల్లడించారు. ఆ సమస్యల ప్రభావంతో శరీరంలో మార్పులు వచ్చాయని, అందువల్లే ప్రస్తుతం కాస్త బొద్దుగా కనిపిస్తున్నానని తెలిపారు. ఈ పరిస్థితి శాశ్వతం కాదని, ఆరోగ్య సమస్యల నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ సన్నగా, ఆరోగ్యంగా కనిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా సినీ, టెలివిజన్ రంగంలో ఎన్నో అనుభవాలు ఎదుర్కొన్నానని రష్మీ అన్నారు. విజయాలు, అపజయాలు రెండింటినీ సమానంగా స్వీకరించానని, ప్రతి అనుభవం తనకు కొత్త పాఠాన్ని నేర్పిందని చెప్పారు. అందుకే జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వం అలవాటైందని పేర్కొన్నారు. రష్మీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ఆమె ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్న అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మద్దతు తెలియజేస్తున్నారు.

# చిన్న వయసులోనే..

సినీ పరిశ్రమలో నటీనటుల వ్యక్తిగత జీవితం ఎప్పుడూ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంటుంది. ముఖ్యంగా ప్రేమ వివాహాలు, వయసు తేడా ఉన్న జంటలు, పెళ్లిళ్లు, విడాకులు వంటి అంశాలు తరచూ చర్చనీయాంశాలవుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి నజ్రియా నజీమ్ వివాహం మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చింది. తమిళ, మలయాళ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నజ్రియా నజీమ్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. పలు డబ్బింగ్ చిత్రాలతో పాటు నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'అంటే... సుందరానికి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తన సహజమైన నటన, అందంతో యువతలో మంచి అభిమానాన్ని సంపాదించుకున్నారు. నజ్రియా సినీ జీవితంలో మంచి అవకాశాలు వస్తున్న సమయంలోనే ప్రముఖ మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్‌తో ప్రేమలో పడ్డారు. ఇద్దరూ కలిసి నటించిన 'బెంగళూరు డేస్' సినిమా సమయంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. నజ్రియా వివాహం చేసుకున్న సమయంలో ఆమె వయసు చాలా తక్కువగా ఉండటంతో ఆ విషయం అప్పట్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఫహద్ ఫాజిల్ ఆమె కంటే వయసులో పెద్దవారు కావడంతో వీరిద్దరి మధ్య



ఉన్న వయసు తేడాపై కూడా అనేక కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ జంట మాత్రం అలాంటి చర్చలను పట్టించుకోకుండా తమ దాంపత్య జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వివాహం తర్వాత కూడా నజ్రియా నటిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, ఫహద్ ఫాజిల్ దక్షిణాది సినీ పరిశ్రమలో అగ్రశ్రేణి నటుడిగా వరుస విజయాలను అందుకుంటున్నారు. ఇద్దరూ తమ తమ చిత్రాలతో బిజీగా ఉంటూ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను సమతుల్యంగా కొనసాగిస్తున్నారు. మధ్యలో వీరిద్దరూ విడిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పలు ప్రచారాలు జరిగినప్పటికీ, వాటిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అనంతరం ఈ జంట కలిసి పలు సందర్భాల్లో కనిపించడంతో ఆ ప్రచారాలకు తెరపడింది. ప్రస్తుతం నజ్రియా, ఫహద్ ఫాజిల్ దంపతులు తమ సినీ జీవితంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు.

**The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.**